

భద్రతా ఏర్పాట్ల పరిశీలన
వివిధ దేశాల సుందరీమణులు ఈనెల 12న సాగర్‌కు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఏఎస్పీ మౌనిక పరిశీలించారు. - 8లో



'ప్రీమియర్' ఎదుట ధర్నా
తమ డిమాండ్లు నెరవేర్చాలని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
41°/24°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం ఎగుమతిలో జాప్యం చేయొద్దు



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు ఎగుమతి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి(రెవెన్యూ) కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ అంజిరెడ్డితో కలిసి ఆలేరు, కొల్లూరులో కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేసిన తరువాత కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను ఏరోజుకారోజు ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. ఆలేరు మండలంలో ఇప్పటి వరకు 84,248 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు.

శివుడికి విశేష పూజలు



శివాలయంలో స్పటికలింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి అనుబంధంగా కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో సంప్రదాయ పూజలు విశేషంగా చేపట్టారు. సోమవారం స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖమండపంలోని స్పటికలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు.

మహిళా సదస్సును జయప్రదం చేయాలి



మహిళా కూలీల సమస్యలపై అధ్యయనం చేస్తున్న రాష్ట్ర కన్వీనర్ పద్మ

భువనగిరి : కేరళలో ఈ నెల 9,10 తేదీల్లో జరగనున్న మహిళా కూలీల జాతీయ సదస్సును జయప్రదం చేయాలని మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ పేర్కొన్నారు. సోమవారం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా కూలీల సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళలపై వివక్ష కొనసాగుతుందన్నారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయే తప్ప.. తగ్గడం లేదన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. సదస్సుకు మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కుమారి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, కూలీలు సత్తమ్మ, మాధవి, సువర్ణ, స్వాతి, కవిత, బాలమణి,పోచమ్మ,అఖిల తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్‌కు అవార్డు



సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహేందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం): విధి నిర్వహణలో ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు గాను ఆత్మకూర్ (ఎం) మండలం రహీంఖాన్‌పేటకు చెందిన తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్ తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ అవార్డుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. అదే విధంగా డీజీపీ చేతుల మీదుగా రూ.50వేల నగదు రివార్డుతో పాటు ప్రశంసా పత్రం తీసుకున్నారు.

హెచ్‌ఎండీఏ నుంచి 56 కోట్లు

మున్సిపాలిటీలు, గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు

- సీసీ, బీటీ రోడ్లు, డ్రెయినేజీలకు ప్రాధాన్యం
- ప్రతిపాదనలకు హెచ్‌ఎండీఏ ఆమోదం
- 15వ తేదీ లోపు టెండర్లు పూర్తి



భువనగిరి పట్టణంలో ప్రారంభం కానున్న ప్రధాన రహదారి ఫుట్‌పాత్ పనులు

సాక్షి,యాదాద్రి : హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలోని మున్సిపాలిటీలకు, గ్రామాలకు ఆ సంస్థ నుంచి రూ.56.18 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో రోడ్లు, డ్రెయినేజీల పనులు చేపడతారు. ఈ నెల 15లోపు టెండర్లు పిలిచి ఆరు నెలల్లో పూర్తయ్యేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు

నిధులను వీటికి ఖర్చు చేస్తారు

- భువనగిరి మున్సిపాలిటీలో రూ.5.80 కోట్లతో ప్రధాన రోడ్డు ఫుట్‌పాత్, సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ డ్రెయినేజీ నిర్మిస్తారు. వార్డుల్లో అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఫుట్‌పాత్ పేవ్‌మెంట్ పనులకు రూ.7.80 కోట్లు కేటాయించారు.
- భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.7.90 కోట్లు
- భువనగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.9.50 కోట్లు
- బీబీనగర్ మండలంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణానికి రూ.16.08 కోట్లు
- భూదాన్‌పోచంపల్లి మండలంలో సీసీ రోడ్లు, అంతర్గత డ్రెయినేజీలకు రూ.9.10 కోట్లు కేటాయించారు.

కొత్త మండలాలకూ త్వరలో నిధులు

హెచ్‌ఎండీఏలో కొత్తగా చేరిన మండలాలకు నిధుల కేటాయింపునకు మరికొంత సమయం పట్టనుంది. ప్రస్తుతం ఐదు మండలాలు, మూడు మున్సిపాలిటీలకు మాత్రమే నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో భువనగిరి, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలకు నిధులు మంజూరయ్యాయి. చౌటుప్పల్, బొమ్మలరామారం మండలాలకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధుల కోసం అక్కడి ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పెరిగిన హెచ్‌ఎండీఏ పరిధి

2025 మార్చిలో హెచ్‌ఎండీఏ పరిధిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలిసారి 2009లో హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించారు. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు కోర్ అర్బన్ సిటీగా, ఔటర్ రింగ్ రోడ్డునుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు సెమీఅర్బన్ ఏరియాగా ప్రభుత్వం నిర్ధారించింది. హెచ్‌ఎండీ పరిధిలో ఇప్పటికే భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. తాజాగా పరిధి పెంచడంతో కొత్తగా తుర్కపల్లి, రాజాపేట, యాదగిరిగుట్ట, వలిగొండ, సంస్థాన్‌నారాయణపురంలోని పలు గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చాయి. ఈ గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి ఏడాదిలోగా అమలు చేయనున్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉందని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు చెప్పారు.

తక్షణ అవసరాలకు ఖర్చు చేస్తాం



హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న భువనగిరి నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలకు నిధులు మంజూయ్యాయి. ఈ నిధులను తక్షణ అవసరాల నిమిత్తం ఖర్చుచేస్తాం. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి హెచ్‌ఎండీఏకు పంపగా ఆమోదించింది. టెండర్లు నడుస్తున్నాయి. కొత్తగా హెచ్‌ఎండీఏలో చేరిన వలిగొండ మండలానికి వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరవుతాయి.

-కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ హనుమంతరావు



సర్వేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు(ఎం): రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆత్మకూర్(ఎం) మండలంలోని సర్వేపల్లి, రాయిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్నట్లయితే రైతులు లిఖితపూర్వకంగా అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి జూన్ 2న పరిష్కార పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సర్వేపల్లి గ్రామానికి చెందిన కాసరబాద అంజయ్య అనే రైతుతో మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్న సన్నబియ్యం ఏవిధంగా ఉన్నాయని అడగగా.. బాగున్నాయంటూ బదులిచ్చాడు. సదస్సుల్లో రాయిపల్లిలో 15, సర్వేపల్లిలో 4 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ లావణ్య రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐలు మల్లిఖార్జునరావు, పాండు, సర్వేయర్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్లు నవనీత, సంజీవ కంప్యూటర్ ఆపరేటర్ వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మోజిగూడెం అండర్‌పాస్‌కు మోక్షం

- హైదరాబాద్‌లో వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



అండర్‌పాస్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ, పక్కన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగే చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం స్టేజీ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సోమవారం హైదరాబాద్‌లో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ధర్మోజీగూడెం కూడలి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఒక్కోసారి ఇద్దరు, ముగ్గురు మృత్యువాత పడ్డారు. అత్యంత ప్రమాదకరమైన ఈ ప్రాంతంలో ప్రస్తుతం జరిగే 17 బ్లాక్‌స్పాట్‌లతో పాటు ఇక్కడ కూడా పనులు చేపట్టాల్సి ఉండే. వెహికిల్ అండర్‌పాస్ వంతెన అవసరమని గుర్తించిన జాతీయ రహదారి సంస్థ అధికారులు.. కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంతో ఎట్టకేలకు మోక్షం లభించింది. వంతెన పూర్తయితే ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. నేషనల్ హైవే అథారిటీ నుంచి అనుమతులు రాగానే అండర్‌పాస్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని గడ్కరీ ప్రకటించారు.

గాలివాన బీభత్సం

భువనగిరిటౌన్, ఆలేరు : పలు మండలాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి భువనగిరి, ఆలేరు పట్టణాల్లో రహదారులు జలమయం అయ్యాయి. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆలేరు పట్టణంతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. బొమ్మలరామారంలో 8, తుర్కపల్లిలో 7.3, భూదాన్‌పోచంపల్లిలో 6, రాజాపేటలో 5.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం సైతం జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

- శాస్త్రవేత్తలు భద్రునాయక్, అనిల్‌కుమార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

చౌటుప్పల్ రూరల్ : రైతులు పంటల సాగులో మెళకువలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ భద్రునాయక్, డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం రైతువేదికలో నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఆధునిక పద్ధతులు అందిపుచ్చుకోవాలని, భూసార పరీక్షలు చేయించి నేల స్వభావాన్ని బట్టి పంటలు వేయాలని సూచించారు. ఎరువుల వాడకం, రసాయనాలు తక్కువ మోతాదులో వాడాలన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పల్లె శేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రాసేనారెడ్డి, మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపుతో వినోదం, విజ్ఞానం

- డీఈఓ సత్యనారాయణ



పోచంపల్లి కేజీబీవీలో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న డీఈఓ సత్యనారాయణ

భూదాన్‌పోచంపల్లి : వినోదంతో పాటు విజ్ఞానం పంచేందుకు సమ్మర్ క్యాంపు దోహదపడుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. లలితకళలు, సంగీతం, డ్యాన్స్, డ్రాయింగ్, కంప్యూటర్ నైపుణ్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్, గణితంలో మెళకువలు, యోగా, క్రీడల్లో ఈనెల 20వరకు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీల నుంచి 100 మంది విద్యార్థులు క్యాంపులో పాల్గొంటున్నార, వీరికి ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కూడా కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ ఈక్విటీ కోఆర్డినేటర్ సీహెచ్ రాధ, క్యాంప్ కోఆర్డినేటర్ ఇందిర, అసిస్టెంట్ కోఆర్డినేటర్ భవానీ, రిసోర్స్ పర్సన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఏఎస్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తరలివచ్చి.. వినతులిచ్చి

- ప్రజావాణిలో 50కి పైగా అర్జీలు
- సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను వేడుకున్న ప్రజలు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

భువనగిరిటౌన్ : బస్సు సౌకర్యం లేదని, భూములు ఆక్రమించారని, పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని.. ఇలా వివిధ సమస్యలపై ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చిన అర్జీలు అందజేశారు. ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ హనుమంతరావు అర్జీలు స్వీకరించి ఆయా శాఖలకు రెఫర్ చేశారు. 50కి పైగా అర్జీలు రాగా అందులో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించి 29 అర్జీలు ఉన్నాయి. పంచాయరాజ్ 8, సర్వే ల్యాండ్స్ 3, హౌసింగ్ 2, ఆర్టీసీ 2, లేబర్, విద్యశాఖ, ఇంటర్మీడియట్ , జిల్లా గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించి ఒక్కొకటి చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, బేస్మెంట్ పూర్తయిన ఇళ్లకు రూ.లక్ష, స్లాబ్ పూర్తయితే రూ.2లక్షలు, ఆ తదుపరి రూ.2లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందన్న విషయాన్ని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్ పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండా పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన భూక్యా రఘు విన్నవించారు.
- రామన్నపేటలోని ధోబిఘాట్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రామన్నపేట మండల రజక సహకార సంఘం ప్రతినిధులు కోరారు.
- బీబీనగర్ మండలం నెమరగొముల గ్రామంలో 115 ఎకరాల భూదాన భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని రక్షించాలని కోరుతూ భువనగిరికి చెందిన ఖాజా ఖుత్బుద్దీన్ కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

హామీలు అమలు చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు కోరారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నెలకు రూ.30వేలు పెన్షన్ ఇవ్వాలని, సమరయోధులుగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, 250 గజాల ఇంటిస్థలం కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జార్ఖండ్ తరహాలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులుగా గుర్తించి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సంగిశెట్టి క్రిష్టపర్, సింగిశెట్టి జనార్దన్, మటి లింగయ్య, అవిశెట్టి రమేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు

ప్రజావాణిలో న్యాయవాది నియామకం

భూ సమస్యలు, ఇతర న్యాయపరమైన కేసులకు సంబంధించి అర్జీలు పెద్ద ఎత్తున వస్తున్నందున ఇకపై ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి ఒక అడ్వకేట్ పాల్గొంటారు. బాధితులకు లీగల్ అడ్వైజ్ ఇవ్వడంతోపాటు కోర్టు కేసులకు సంబంధించిన అర్జీల స్థితిగతులను తెలియజేయనున్నారు.



ప్రజావాణికి వచ్చిన ట్యాక్స్‌పెయిడ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

స్కూల్ బస్సులను అద్దెకు ఇవ్వకుండా చూడాలని వినతి

పాఠశాలల బస్సులు వివాహాది శుభకార్యాలకు అద్దెకు ఇవ్వకుండా చూడాలని ట్రావెల్స్ బస్సుల యజమానులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఒక్క బస్సుకు సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ట్యాక్స్, రూ.60 వేలకు పైగా ఇన్సూరెన్స్ చెల్లిస్తున్నామని, కిరాయిలు లేకపోవడంతో కుటుంబసభ్యుల బంగారు అబరణాలు కుదువపెట్టి ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు రిజిస్ట్రేషన్ లేకపోయినా అద్దెకు ఇస్తున్నారని, పైగా తక్కువ చార్జి తీసుకుంటున్నారని.. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. వెంటనే స్కూల్ బస్సుల పర్మిట్లు రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కంచర్ల వెంకట్, జంగారెడ్డి, అంబటి సుధాకర్, పెండెం బాలనర్సింహ, లవట్, కూనుజు నర్సింహాచారి, మైలారం నర్సింహా, పన్నల మల్లారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

యువకుడు అదృశ్యం


పిట్టల సందీప్

రామన్నపేట: రామన్నపేట మండల కేంద్రానికి చెందిన పిట్టల సందీప్ అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం శివారులోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సందీప్ గత నెల 28న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా సందీప్ ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సందీప్ భార్య దివ్య రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం

మునగాల: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్ తండాలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్ తండాకు చెందిన దివ్యాంగురాలు గంటపంగు సైదమ్మ తన ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా.. సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, వంట సామగ్రి, దుస్తులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.70వేల మేరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

రోడ్డు వెంట రసాయన వ్యర్థాలు వదులుతున్న లారీలు సీజ్

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారి వెంట రసాయన వ్యర్థాలను వదులుతున్న రెండు లారీలను పోలీసులు సీజ్ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి రసాయన వ్యర్థాలతో వచ్చిన రెండు లారీలు ఆదివారం రాత్రి అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారి వెంట వాటిని వదులుతుండగా గ్రామస్తులకు తీవ్ర దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొంగల సతీష్ ఫిర్యాదు మేరకు లారీ యజమానులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి. మహేశ్వర్ తెలిపారు.

హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్ట్

తుర్కపల్లి: హత్య కేసులో నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎం. కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... తుర్కపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన దాసారం సాయికుమార్.. తలారి ఆంజనేయులు భార్యను వేధింపులకు గురిచేస్తుండడంతో ఈ నెల 1వ తేదీన తలారి ఆంజనేయులు, గువ్వ రమేష్, తలారి కొండయ్య, తలారి వెంకటేష్ కలిసి సాయికుమార్ గొంతు కోసి హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా ములుగు మండలం సింగన్నగూడెం గ్రామ శివారులోకి తీసుకెళ్లి డీజిల్ పోసి నిప్పంటించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న తుర్కపల్లి పోలీసులు నలుగురు నిందితులను సోమవారం అరెస్ట్ చేశారు.

యాదగిరిగుట్ట కారిడార్ అభివృద్ధి చేయండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


నితిన్ గడ్కరీకి వినతి పత్రం అందజేస్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి: భువనగిరి పార్లమెంట్ పరిధిలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర రోడ్లు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి గడ్కరీని ఎంపీ చామల కలిసి వినతి పత్రం అందజేశారు. యాదగిరిగుట్ట ఆలయ పరిసర కారిడార్‌లో రహదారుల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీ కోరారు. ప్రాచీన దేవాలయాలు, వారసత్వ గ్రామాల మధ్య సరైన రహదారి కనెక్టివిటీ లేకపోవడం వల్ల భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, కొలనుపాక, కీసరగుట్ట, పెంబర్తి ప్రాంతాల మధ్య కనెక్టివిటీ రోడ్లు విస్తరించాలని కోరారు. అలాగే ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 8 నుంచి కీసర జంక్షన్- యాదగిరిగుట్ట-కొలనుపాక-పెంబర్తి మధ్యన రోడ్డు అభివృద్ధి చేస్తే యాదగిరిగుట్ట ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. వరంగల్, కరీంనగర్ హైవేలపై ట్రాఫిక్‌ను తగ్గించేందుకు కూడా ఈ దారి ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుందన్నారు. ఆలేరు నుంచి బచ్చన్నపేట వరకు లింక్ రోడ్డు నిర్మాణం ద్వారా జాతీయరహదారి 163-365బీ మధ్యన అనుసంధానం కలుగుతుందన్నారు. దీనివల్ల కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు మేలు జరుగుతుందన్నారు. హైదరాబాద్-యాదగిరిగుట్ట రహదారిలో ఇప్పటికే ఆమోదించిన బ్లాక్ స్పాట్ల వద్ద మరమ్మతులు తక్షణమే చేపట్టాలన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని పెద్దఅంబర్‌పేట్ మరియు లక్ష్మారెడ్డి పాలెం ప్రాంతాల్లో రెండు ఎలివేటెడ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లు మంజూరు చేయాలన్నారు.

సాగర్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ


బుద్ధవనంలో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న దేవరకొండ అడిషనల్ ఎస్పీ మౌనిక

నాగార్జునసాగర్: హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన పలువురు సుందరీమణులు బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని ఈ నెల 12న నాగార్జునసాగర్‌కు రానున్నారు. సాగర్‌లోని బుద్ధవనం, విజయవిహార్ అతిథిగృహం ప్రాంతాల్లో వారు పర్యటించనున్న నేపథ్యంలో ఆ ప్రదేశాలను దేవరకొండ ఏఎస్పీ మౌనిక సోమవారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం భద్రతా ఏర్పాట్లపై బుద్ధవనంలోని మహాస్తూపం అంతర్భాగంలో గల సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ.. భద్రతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాగార్జునసాగర్ సీఐ శ్రీనునాయక్, హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, హాలియా, సాగర్ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు సంపత్‌గౌడ్, వీరశేఖర్, వీరబాబు, సతీష్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరి క్షేత్రంలో తిరువీధి ఉత్సవ సేవ


స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామికి సోమవారం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామికి నిత్య కల్యాణం, మధ్యాహ్నం సుమారు 3వేల మందికి అన్నదానం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. మహిళ దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుర్రంపోడు: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో మహిళ మృతిచెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ-దేవరకొండ రహదారిపై గుర్రంపోడు మండలంలోని చేపూరు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బాలాపూర్‌కు చెందిన అంజుమ ఖాతూన్(43) కుమార్తె సబీనాఖాతూన్, అల్లుడు మహ్మద్ సలామ్ గుర్రంపోడు మండలంలోని పోచంపల్లిలో ఓ రైతు తోటలో కూలీ పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నారు. కుమార్తెను, అల్లుడిని చూసేందుకు అంజుమఖాతూన్, ఆమె భర్త అబ్దుల్ సలామ్‌తో కలిసి పోచంపల్లికి వచ్చారు. సోమవారం పని నిమిత్తం అల్లుడు మహ్మద్ సలామ్ తన బైక్‌పై అత్త అంజుమ్‌ఖాతున్, మామ అబ్దుల్ సలామ్‌ను ఎక్కించుకుని చేపూరుకు వెళ్లి తిరిగి పోచంపల్లికి వస్తుండగా.. చేపూరు క్రాస్ రోడ్డు వద్ద నల్లగొండ నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజుమఖాతూన్ అక్కడికక్కడే మృతిచెందింది. మహ్మద్ సలామ్, అబ్దుల్ సలామ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంజుమఖాతూన్ మృతదేహాన్ని పోలీసులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె సబీనాఖాతూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

రామన్నపేట: అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ శివారులో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌కు చెందిన రెండు కుటుంబాల వారు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడపలో బొడ్రాయి పండుగకు వెళ్లారు. సోమవారం ఆటోలో రామాంతాపూర్‌కు తిరుగు పయనమయ్యారు. ఆటో రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ శివారులోని కోళ్లఫాంల వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బి. జ్యోతి, వైష్ణవి, కె. గంగమ్మ, వెంకటేష్, కొండయ్యతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్


నల్లగొండ: కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద, నంబర్ ప్లేట్ లేని, మైనర్ డ్రైవింగ్, సరైన పత్రాలు లేని 35 వాహనాలను సీజ్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వ్యక్తులను పట్టుకుని వారిపై కూడా కేసులు నమోదు చేశారు. అనంతరం డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు ఎన్ సందీప్‌రెడ్డి, వి. శంకర్, జె. సైదులు, ఏఎస్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనయ్య పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: నంబర్ ప్లేట్లు లేని, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపినట్లయితే వాహనదారులపై తగిన చర్యలు తీసుకుంటామని నార్కట్‌పల్లి సీఐ నాగరాజు హెచ్చరించారు. చిట్యాలలో సోమవారం ఎస్‌ఐ ఎన్. ధర్మాతో కలిసి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామంలో ఆదివారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమైనట్లు ఎస్‌ఐ రామ్మూర్తి సోమవారం తెలిపారు. మృతుడు హైదరాబాద్‌కు చెందిన ముడుసు కార్తీక్(28)గా గుర్తించామన్నారు. అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆదివారం తన స్నేహితులతో కలిసి కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని రైస్ మిల్లుల వద్ద బంధువుల పెళ్లికి వచ్చి మధ్యాహ్న సమయంలో ఈత కొట్టడానికి చింతకుంట్ల గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో దిగగా.. ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి తల్లి, తమ్ముడు ఉన్నట్లు సమాచారం.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

చండూరు: ఎండల తీవ్రతకు చండూరు మున్సిపాలిటీకి చెందిన దోటి నరసింహ(80) వడదెబ్బకు గురై సోమవారం సాయంత్రం మృతిచెందాడు. సీపీఐ నాయకులు నరసింహ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాపుగల్లులో పిచ్చికుక్క స్వైరవిహారం

- నలుగురు వ్యక్తులు, 60 గేదెలపై దాడి

కోదాడరూరల్: కోదాడ మండలం కాపుగల్లులో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో నలుగురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచింది. అదేవిధంగా 60 పశువులపై కూడ దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించి వాటి నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఎదుట కార్మికుల ధర్నా


కంపెనీ గేటు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

- తమ సమస్యలను పరిష్కరిస్తేనే విధులకు హాజరవుతామని తెలిపిన కార్మికులు

మోటకొండూర్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ గేటు ఎదుట సోమవారం ఉదయం అందులో పనిచేసే కార్మికులు ధర్నా చేపట్టారు. ఇటీవల కంపెనీలో రియాక్టర్ పేలి ముగ్గురు దుర్మరణం చెందగా.. తమ ప్రాణాలకు భరోసా కల్పించాలని, కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలని, రోజుకు 8 గంటలే పని ఉండేలా చూడాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. డ్యూటీలో ఇద్దరు కార్మికులను, ఒక డాక్టర్ ఎల్లప్పుడూ కంపెనీలో అందుబాటులో ఉంచాలన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించి కంపెనీ నుంచే ప్రతి ఒక్కరిని రిక్రూట్ చేసుకోవాలన్నారు. మెరుగైన ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు పనిలో చేరి వెంటనే ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వాలని, కార్మికుల కోసం భోజనం హాల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ వచ్చి వీలైనంత త్వరగా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే తమ న్యాయమైన డిమాండ్లను నెరవేరిస్తేనే విధులకు హాజరవుతామని, అప్పటి వరకు కంపెనీకి రాలేమని కార్మికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ధర్నాలో కార్మికులు జి. నాగిరెడ్డి, వాకిటి నవీన్‌రెడ్డి, కాదూరి ఎలేందర్, బాల్ద సిద్దులు, నాగార్జున, ప్రవీణ్, చందు, నాగరాజు తదితరులు ఉన్నారు.

డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జహంగీర్ అలీ


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్ అలీ

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ జహంగీర్ అలీ ఎన్నికయ్యారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ హిలావత్ అంజియా వ్యవహరించారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఎండీ. జహంగీర్ అలీ, సంగారెడ్డి జిల్లాకు చెందిన మల్లేష్‌గౌడ్, ఖమ్మం నుంచి కె. వెంకటేశ్వర్లు అధ్యక్ష స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. చివరకు వెంకటేశ్వర్లు, మల్లేష్ నామినేషన్లు ఉపసంహరించుకోగా.. జహంగీర్ అలీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కాగా, సోమవారం ఖమ్మంలోని డ్రైవర్ల సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు సంఘంలో గతంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎండీ సలీం, దాసరి వేణు, లింగంపల్లి గంగన్న, జి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత లేకుండా చూస్తాం

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్


తాటిపాముల కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న డీఎస్ చౌహాన్

తిరుమలగిరి (తుంగతుర్తి): కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించడానికి లారీల కొరత లేకుండా చూస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని మిల్లులకు పంపిన 24 గంటల లోపు ట్రక్ షీట్లు తెచ్చి ట్యాబ్ ఎంట్రీ చేయాలని ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టి 17 శాతం లోపు తేమ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ బి. రాంబాబు, తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే జాన్‌మహ్మద్ ఉన్నారు.

రూ.10 కోట్ల విలువ చేసే గంజాయి దహనం


వివరాలు వెల్లడిస్తున్న చందనాదీప్తి

భువనగిరి: రైళ్లలో తరలిస్తుండగా పట్టుకున్న గంజాయిని సికింద్రాబాద్ రైల్వే డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ చందనాదీప్తి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురంలోని రోమా పరిశ్రమలో దహనం చేశారు. పరిశ్రమ వద్ద చందనాదీప్తి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2024 నుంచి 2025 మే 5 వరకు రైళ్లలో తనిఖీలు నిర్వహించి 2010 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొత్తం 74 కేసులను నమోదు చేసి పట్టుకున్న గంజాయి విలువ రూ. 10,05,06,750 ఉందన్నారు. సికింద్రాబాద్ అర్బన్, రూరల్, కాజీపేట డివిజన్ పరిధిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని తుక్కాపురం గ్రామ పరిధిలోని రోమా కంపెనీలో కాల్చివేసినట్లు చెప్పారు. గంజాయి రవాణాను అడ్డుకునేందుకు రైల్వే స్టేషన్లతో పాటు రైళ్లలో పటిష్ట నిఘా పెడుతున్నట్లు చందనాదీప్తి చెప్పారు. విలేకరుల సమావేశంలో నోడల్ అధికారి ఎన్.జావేద్, కాజీపేట రైల్వే డీఎస్పీ కృపాకర్, సికింద్రాబాద్ రూరల్ డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలం వడ్యతండాకు చెందిన రాజు ఇంట్లో లో సోమవారం తెల్లవారుజామున దొంగలు పడి సుమారు రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

మామిడి కోతలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- పెద్దవూర మండల ఉద్యానవన శాఖ అధికారి మురళి సూచనలు



పాడిపంట

పెద్దవూర: ఈ ఏడాది వాతావరణ మార్పులతో మామిడి దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. మామిడి కాయలు ఇప్పుడిప్పుడే పక్వానికి వస్తున్నాయి. కోతలు కూడా మొదలవుతున్నాయి. అయితే చేతికందిన కాయలు, పండ్లను సరైన పద్ధతుల్లో నిల్వ, రవాణా చేస్తేనే ఎంతో కొంత లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో మామిడి కోతతో పాటు నిల్వ, రవాణా చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మామిడి కాయలు కోసే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం చేసినా అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని పెద్దవూర మండల ఉద్యానవన శాఖ అధికారి మురళి చెబుతున్నారు. కాయలను సరైన పద్ధతిలో కోయకపోవడం, ముదిరిన కాయలతో పాటుగా ముదరని కాయలను కోయడం, గ్రేడింగ్, ప్యాకింగ్‌లో సరైన ప్రమాణాలు పాటించకపోవడం, అపరిశుభ్రత, నిల్వ లోపాల వలన పండ్లు చెడిపోతాయి. సరైన యాజమాన్య పద్ధతులను అనుసరించటం వలన ఈ నష్టాలను తగ్గించుకోవచ్చని ఆయన సూచిస్తున్నారు.

ఉదయం పది గంటలలోపే కోయాలి

మామిడి తోటల్లో కాయలను సరైన దశలోనే కోయాలి. కాయలకు భుజాలు ఏర్పడి, తొడిమ వద్ద గుంత ఉండాలి. శ్వేద గ్రంథులు కనిపిస్తుండాలి. కాయ ఆకుపచ్చ రంగు నుంచి బాగా ముదిరిన లేత ఆకుపచ్చ రంగు కలిగిన కాయలనే కోతకు ఎంపిక చేసుకోవాలి. వీటిలోనూ బ్రిక్స్(చక్కెర శాతం) ఉన్న కాయలనే కోయాలి. బ్రిక్స్ మీటర్ ద్వారా బ్రిక్స్ 10-13 ఉన్న కాయలను కోసుకోవాలి. రిఫ్రాక్టో మీటరును ఉపయోగించి కాయల పరిపక్వ దశను సులభంగా గుర్తించవచ్చు. ఇవి రవాణాకు అనుకూలంగా ఉంటాయి. లోపల కండ లేత పసుపు రంగులో ఉండాలి. కోత ఉదయం 10 గంటల లోపు లేదంటే సాయంత్రం వేళ ఉండాలి. పక్వానికి వచ్చిన కాయలను చిక్కాలను ఉపయోగించి నేలపై పడకుండా కోసుకోవాలి. కాయలకు గాయాలైతే మగ్గబెట్టిన సందర్భంలో శిలీంధ్రాలు ఆశించి కుళ్లిపోయే ప్రమాదం ఉంది. కాయలకు 6 నుంచి 7సెంటీమీటర్ల తొడిమ ఉండేటట్లు చూసుకోవాలి. కాయల మీద ఉండే చర్మానికి సొన(జిగురు) అంటకుండా జాగ్రత్త తీసుకోవాలి. కాయ కోసిన తర్వాత తప్పనిసరిగా సొన (జిగురు) పూర్తిగా కారేలా చూడాలి. తర్వాత తొడిమలను 0.5 నుంచి 1 సెంటీమీటర్ వరకు ఉండేలా పదునైన కత్తితో కత్తిరించాలి. వాటిని తలకిందులుగా పెట్టి రెండుమూడు గంటలపాటు కదిలించకుండా ఉంచాలి. అప్పుడే కాయల నుంచి సొన సజావుగా నేల మీదికి కారుతుంది. కోతల సమయంలో కాయలపై చిన్న మచ్చ గాని, దెబ్బ గాని తగలకుండా జాగ్రత్త పడాలి. కోసిన కాయలను మట్టి నేలపై ఉంచకూడదు.

శుభ్రపర్చడం చాలా అవసరం

మామిడి కాయలను శుభ్రపరచడం చాలా అవసరం. 10 గ్రాముల డిటర్జంట్‌ను 10 లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో కాయలను కడగాలి. తర్వాత 52 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత గల వేడి నీటిలో 200 పీపీఎం సోడియం హైపోక్లోరైడ్ కలిపి 2 నుంచి 3 నిమిషాల పాటు ఉంచాలి. రవాణా సమయంలో ఆంత్రాక్నోస్, పండు ఈగల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు కాయలను 48+0.3 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత కలిగిన నీటిలో గంట సేపు శుద్ధి చేయాలి. కాయలపై ఉన్న తేమ ఆరే వరకు నీడలో ఆరబెట్టాలి. 300-350 గ్రాముల బరువు ఉండేటట్లు గ్రేడింగ్ చేసుకుని, అట్టపెట్టెలలో 10 నుంచి 13 కాయలు అమర్చి ప్యాకింగ్ చేసుకోవాలి. ప్యాంకిగ్ కోసం టెలిస్కోపిక్ కార్గేటెడ్ ఫైబర్ బోర్డు బాక్సులను వాడాలి. వీటిని ఆరుగంటల లోపే ప్యాక్‌హౌజ్‌కు తరలించాలి. విదేశాలకు ఎగుమతి చేయాల్సిన పండ్లకు తప్పనిసరిగా ఇర్రాడియేషన్ చేయించాలి. ఒకసారి కోతకు ఉపయోగించిన పనిముట్లను తిరిగి మళ్లీ వాడాల్సి వస్తే వాటిని తప్పనిసరిగా శుభ్రం చేయాలి.

ఇథిలిన్‌తో మాగబెట్టాలి

మామిడి కాయలను వ్యాపారులు కార్బైడ్ అనే రసాయనాన్ని ఉపయోగించి కృత్రిమంగా మాగబెడతారు. దీని వలన కాయ మంచి రంగు వస్తుంది కాని రుచి ఉండదు. పైగా అనారోగ్యానికి కారణమవుతోంది. రైతులు, వ్యాపారులు కార్బైడ్‌తో మాగబెట్టడానికి స్వస్తి పలికి ఆరోగ్యవంతమైన పద్ధతుల ద్వారా మాగించాలి. అప్పుడే రుచి, శుచి లభిస్తాయి. ఈ రెండు ఉంటే మంచి ధర లభిస్తుంది. ఇథిలిన్‌తో మామిడిని మాగించడం అన్ని విధాలా మంచిది. ఇథిలిన్ అనేది గ్రోత్ హార్మోన్. ఇది అన్నిచోట్ల లభ్యమవుతుంది. 10 లీటర్ల నీటికి ఒక మిల్లీలీటర్ ఇథిలిన్ కలిపిన ద్రావణంలో మామిడి కాయలను ముంచి నీడలో ఆరబెట్టిన తర్వాత గదిలో మామిడిని పోసి వరిగడ్డి కప్పితే 14 గంటల్లోనే మంచి రంగు, సువాసన వస్తుంది. ఇలా మామిడిని మాగించడం అన్ని విధాలా ఆరోగ్యదాయకం.

పురుగు మందులను పిచికారీ చేయరాదు

నిషేధించిన పురుగు మందులను కాయలపై పిచికారీ చేయకూడదు. వీలైనంత వరకు సేంద్రీయ పురుగు మందులను మాత్రమే వాడాలి. కోత తర్వాత వచ్చే తెగుళ్ల నివారణకు తోటలో ముందు నుంచే మంచి జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలో కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలి. కాయలు చిన్నసైజులో ఉన్నప్పుడు, తిరిగి కాయ కోతకు ముందు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా థయోఫానేట్ మిథైల్ కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. కాత దశలో మూడుసార్లు ఇలా పిచికారీ చేస్తే కాయలపై చీడల బెడద తగ్గుతుంది. కాయలు కుళ్లిపోకుండా ఉంటాయి.